క్లుప్తంగా

ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో రెండు రోజుల పాటు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ పర్యటించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి మూర్తి తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 10.30 గంటలకు కుప్పం ఆర్అండ్బీ అతిథి గృహానికి చేరుకుంటారన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రామకుప్పం మండలం, వీరణమాల పెద్దతాండా చేరుకుని అక్కడ గిరిజనులతో ముఖాముఖి అనంతరం తిరిగి రోడ్డు మార్గాన చిత్తూరు ఆర్అండ్బి అతిథి గృహానికి చేరుకుంటారన్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు గంగవరం మండలం కుయ్యవంక గిరిజనకాలనీలో స్థానికులతో సమావేశమవుతారన్నారు. అనంతరం విజయవాడకు వెళతారని వివరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రూరల్ చెర్లోపల్లెలో సబ్స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. చెర్లోపల్లె, ఏనుగుండ్లపల్లె, కమ్మపల్లె, చెర్లోపల్లె హైవే, కుక్కలపల్లె, అడిగానుడూరు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

చిత్తూరు తహసీల్దార్గా మురళీమోహన్



చిత్తూరు రూరల్: చిత్తూరు తహసీల్దార్గా మురళీమోహన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు మండల రెవెన్యూ అధికారులు, వీఆర్ఓలు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఇంతకుముందు ఈస్థానంలో డీటీ కిరణ్ ఇన్చార్జ్గా బాధ్యతలు నిర్వర్తించారు.

హోంగార్డులు తప్పు చేస్తే సహించను

చిత్తూరు రూరల్: డీటీసీ పరిధిలో పనిచేస్తున్న హోంగార్డులు తప్పులు చేస్తే సహించనని డీటీసీ నిరంజన్రెడ్డి హెచ్చరించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. హోంగార్డుల వస్తున్న ఆరోపణలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామన్నారు. డ్యూటీలు ఒకే చోట వేయకుండా నెలరోజులకోసారి వేర్వేరు ప్రాంతాలకు మారుస్తున్నామన్నారు. హోంగార్డులు ఏవరైనా చేతివాటం ప్రదర్శిస్తున్నారని తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

14న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ కానుకలను ఈ నెల 14న శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో లెక్కించే హుండీ కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది అంతా హజరు కావాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో అక్రమ మద్యంపై మంగళవారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో చెర్లోపల్లె క్రాస్ వద్ద 28 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిని విక్రయిస్తున్న మురుగన్(42)ను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, ఎస్ఐ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం చంద్రశేఖర్

పూతలపట్టు: జాతీయస్థాయిలో పూతలపట్టు విద్యార్థులు ప్రతిభ చూపారని మండలకేంద్రంలోని ప్రభుత్వ స్కూల్ హెచ్ఎం చంద్రశేఖర్ అన్నారు. తమ పాఠశాలలో చదువుతున్న ఎస్.హసన్, కె.గిరివర్ధన్ అండర్-13 మోడ్రన్ పెంటాథలాన్ లేజర్ రన్నింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారని అన్నారు. మంగళవారం ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ చదువుల్లోనే కాకుండా విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. వీరు ఈ నెల 7 నుంచి మహారాష్ట్రలోని అహ్మదానగరంలో జరిగే డివిజనల్ స్పోర్ట్స్ కాంపిటీషన్స్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- చిత్తూరు రూరల్ మండలం పాలూరుకు చెందిన వలంటీర్ గుండలయ్య కరోనా విపత్తులో ప్రాణాలకు ఎదురొడ్డి సేవలను అందించాడు. క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి రెడ్జోన్లలో కరోనా పీడితుల కావాల్సిన సహాయ సహకారాలు అందించడంలో ముందు వరుసలో నిలిచాడు. పాజిటివ్ కేసులు నమోదైన వీధుల్లోకి వెళ్లి బ్లీచింగ్ చల్లడం, వారు ఇంటి నుంచి బయట రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం... ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి అధికారులకు చేరవేస్తూ వచ్చాడు.



కరోనా బాధితుడి ఇంటి వద్ద బ్లీచింగ్ చల్లుతున్న వలంటీర్ (ఫైల్)

పల్లె వారధులు..వలంటీర్లు

- ప్రజా సేవలో క్రియాశీలక పాత్ర
- ప్రతి 50 కుటుంబాలకు సేవ
- కరోనా విపత్తులో విశేష సేవలతో కుటుంబాలకు అండ
- వలంటీర్ల వ్యవస్థపై విషం చిమ్ముతున్న ప్రతిపక్షాలు
- మండిపడుతున్న ప్రజానీకం

ప్రజలు–ప్రభుత్వానికి నడుమ వలంటీర్లు వారధులుగా నిలుస్తున్నారు. సంక్షేమ పథకాలను అర్హుల ఇళ్ల దరికి చేరవేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యేకించి, కరోనా మహమ్మారి సమయంలో పాజిటివ్ కేసుల ఇళ్లకు వెళ్లి, విశేష సేవలు అందించి, అందరి మన్ననలు పొందారు. అలాగే ప్రతి నెలా పింఛన్ డబ్బులు ఠంచనుగా లబ్ధిదారులకు ఇస్తూ ఆ కుటుంబాలతో మమేకమయ్యారు. వలంటీర్ల సేవలను ఇతర రాష్ట్రాలు సైతం మెచ్చుకున్నాయి. అంతేకాకుండా జాతీయ స్థాయి పత్రికలు, చానళ్లు సైతం వలంటీర్ల వ్యవస్థపై ప్రత్యేక కథనాలతో ఆంధ్రప్రదేశ్ను కీర్తించాయి. అయితే ఈ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆయన వలంటీర్ల సేవలను కించపరుస్తూ, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించడంతో వలంటీర్ల లోకం భగ్గుమంది. అంతేకాకుండా ప్రజలు సైతం పవన్ను తీవ్రంగా తప్పు పడుతున్నారు.

చిత్తూరు రూరల్ : చిత్తూరు మండలంలో 17 పంచాయతీల పరిధిలో 9 సచివాలయాలు ఉన్నాయి. వీటి కింద 140 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. వారికి కేటాయించిన 50 కుటుంబాలకు ప్రభుత్వ ఫలాలను చేరవేస్తూ వస్తున్నారు. సమస్యలుంటే వాటిని తక్షణం అధికారులు దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రతి సర్వేను పకడ్బందీగా చేస్తూ వచ్చారు. వ్యాక్సినేషన్ లక్ష్యం అధిగమించడంలో వలంటీర్ల పాత్ర కూడా ఎంతగానో ఉంది.

వాళ్లు లేకుంటే..



ఊర్లకు ఊర్లను కరోనా చుట్టిముట్టేసిన సమయమది. జనం ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయం. పక్క ఇంటి వాళ్ల పలకరింపు కూడా కష్టమైంది. అలాంటి సమయంలో వలంటీర్లు ఏమాత్రం భయపడకుండా ఇంటింటికి పింఛన్ తెచ్చి ఇచ్చారు. కరోనా కష్టకాలం అంటూ రూ.1000 ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చారు. ఈ డబ్బులు వేరే వాళ్ల చేతికి ఇచ్చుంటే మింగేసి ఉంటారు. వాళ్ల సేవల గురించి ఎంతచెప్పినా తక్కువే. వారిపై తప్పుడు కూతలు కూస్తే జనమే బుద్ధి చెబుతారు.

–గణేష్, ఐనవేడు, చిత్తూరు మండలం

పుట్టగతులుండవ్



కరోనా వచ్చినప్పటి నుంచి వలంటీర్లు ప్రతి రోజు వీధుల్లోకి వచ్చారు. ఎవరైనా కొత్తగా ఊళ్లోకి వచ్చారా? వచ్చిన పక్షంలోఎక్కడి నుంచి వచ్చారు? వాళ్లకు జ్వరం, ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? మీరంతా ఎలా ఉన్నారు? అని అందరి గురించీ అడిగి తెలుసుకున్నారు. ఇంటి గడప దాటకుండా మాత్రలు, మందులు తెచ్చి ఇచ్చేవారు. ఏవైనా దగ్గు, జలుబు ఉంటే వెంటనే పరీక్షలు చేయించారు. ప్రభుత్వం వేసే ప్రతి రూపాయి కూడా నేరుగా మా ఖాతాలో వచ్చి పడుతున్నాయి. ఇదంతా వలంటీర్ల సేవల వలనే. వారిని తప్పు పడితే పుట్టగతులుండవ్.

–అనురాధ, పెరుమాళ్లకండ్రిగ, చిత్తూరు మండలం

చౌకబారు ఆరోపణలు తగవు

బంగారుపాళెం: ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్కళ్యాణ్ రాజకీయ అజ్ఞానంతో సైకోలా మాట్లాడుతున్నాడని, అతనికి భవిష్యత్లో వలంటీర్లే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. తగ్గువారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని ఆర్ఆర్ నగర్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు డైరెక్షన్లో పవన్ తనకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ప్రజలకు నిత్యం సేవలు అందిస్తున్న వలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి ప్రభుత్వంపై బురద జల్లేందుకు పవన్ యత్నిస్తున్నాడని ఆరోపించారు. గ్రామాల్లోకి వెళ్లి వలంటీర్ల సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకోవాలని పవన్కు సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



బంగారుపాళెంలో పవన్ వ్యాఖ్యలకు నిరసనగా నాలుగురోడ్ల కూడలిలో వలంటీర్ల మానవహారం

బంగారుపాళెం: స్వచ్ఛందంగా సేవలు అందిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా ఉంటున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రం బంగారుపాళెంలో మంగళవారం వలంటీర్లు పవన్కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై భగ్గుమన్నారు. వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. తగ్గువారిపల్లె నుంచి వలంటీర్లు బంగారుపాళెం నాలుగురోడ్ల కూడలికి చేరుకున్నారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి పవన్ వ్యాఖ్యలకు

పవన్కల్యాణ్ వ్యాఖ్యలు అర్థరహితం

వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో జనసేన అధ్యక్షుడు పవన్కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల సంఘం నాయకురాలు మోనీషా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. వలంటీర్లు మహిళల అక్రమ రవాణా చేస్తున్నారని నీచంగా మాట్లాడడం మంచిది కాదన్నారు. పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: అమ్మాయిల అదృశ్యం, మహిళల అక్రమ రవాణాకు వలంటీర్లే కారణమంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్లు భగ్గుమన్నారు. మంగళవారం వారు మండల కేంద్రం యాదమరి మెయిన్ బజారులో నిరసన వ్యక్తం చేశారు. పవన్కల్యాణ్ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాసేవలో ఉన్న తమపై నిందలు వేయడం సరికాదన్నారు. అనంతరం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ దగ్ధం చేశారు. అలాగే పోలీసుస్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పవన్ కల్యాణ్పై ఎస్ఐ సుమన్కు ఫిర్యాదు చేశారు.



యాదమరిలో..

నేడు వలంటీర్ల నిరసన

ఐరాల: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఎంపీడీఓ కార్యాలయం నుంచి బుధవారం వలంటీర్లు నిరసన ర్యాలీ చేపట్టనున్నారు.

జనాభా నియంత్రణకు కృషి చేద్దాం



బంగారుపాళెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



ఐరాల: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

యాదమరి: 'ఇద్దరు వద్దు–ఒక్కరే ముద్దు.. జనాభా పెరుగుదల అభివృద్ధికి అవరోధం.. అందువల్ల ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణకు కృషి చేద్దాం' అని వైద్యాధికారి అనిల్కుమార్ నాయక్ అన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు యాదమరి మెయిన్ బజారులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు జనాభా పెరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ లోహిత్వెంగల్రాయన్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బంగారుపాళెంలో వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాల: జనాభా నియంత్రణ అందరి బాధ్యత అని స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు.



పూతలపట్టులో..

మంగళవారం స్థానిక పీహెచ్సీ సిబ్బంది జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది, ఆశావర్కర్లు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణా, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు లోని చవటపల్లెలో మంగళవారం అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణకు స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్తో ఇంటివద్దకే వైద్యం అందుతోందని గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హరి అన్నారు. మంగళవారం మండలంలోని పాపసముద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులు, బీపీ, షుగర్ సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్ర, కవిత, రుక్మిణి, బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

పాలకలలో ..

ఐరాల: మండలంలోని పాలకల–2లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 90 మంది రోగులకు వైద్య పరీక్షలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



బంగారుపాళెం: సర్టిఫికెట్లు ఇస్తున్న ఎమ్మెల్యే



సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

బంగారుపాళెం: జగనన్న సురక్షతో ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని జిల్లేడుపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్మోహన్రెడ్డి గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకున్న ధ్రువపత్రాలను వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే ఇస్తున్నారన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో 360 మందికి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్రెడ్డి, సర్పంచ్ భారతి, ఎంపీటీసీ శంకర్రెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్రెడ్డి, తహసీల్దార్ బెన్నురాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇదో వరం

తవణంపల్లె: జగనన్న సురక్ష పథకం ప్రజలకు ఓ వరమని జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం జొన్నగురకల, నలిశెట్టిపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. జొన్నగురకలలో 360 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, భూరీసర్వే డీటీ వెంకటరమణను, వలంటీర్లను, సచివాలయ సిబ్బందిని జెడ్పీ సీఈఓ అభినందించారు. అనంతరం హెల్త్క్యాంపును, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. తవణంపల్లె హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బడిబయట ఉన్న పిల్లలను ఈనెలాఖరులోగా బడిలో చేర్పించాలని టీచర్లను ఆదేశించారు. బడి బయట ఉన్న పిల్లలను వందశాతం పాఠశాలల్లో నమోదు చేయించిన మండలానికి ప్రోత్సాహకంగా రూ.5 లక్షలు ఇస్తామన్నారు. నలిశెట్టిపల్లెలో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఏఓ రెడ్డిబాబు ఆధ్వర్యంలో 135 మందికి సర్టిఫికెట్లు ఇచ్చారు.

ముత్తుకూరులో..

చిత్తూరు రూరల్: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీడీఓ సుధాకర్రెడ్డి అన్నారు. చిత్తూరు మండలం ముత్తుకూరులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు పలు రకాల ధ్రువపత్రాలను అందజేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆదాయ సర్టిఫికెట్లు 76, కుల ధ్రువీకరణ పత్రాలు 74, ఆధార్ సేవలు 52 అందించినట్లు చెప్పారు. సర్పంచ్ భాస్కర్, డీటీ ధనంజయ్య, సచివాలయ సిబ్బంది మంజుల, సునీత, నరేష్, శివరాజు పాల్గొన్నారు.

'సురక్ష'తో పథకాల ఫలాలు



గుడిపాల: బసవాపల్లె, చీలాపల్లె సచివాలయాల్లో జగనన్న శిబిరాలు నిర్వహించారు. పలువురికి ధ్రువ పత్రాలు అందజేసి ఎంపీపీ ప్రసాద్రెడ్డి మాట్లాడారు. దాదాపు 600 సర్టిఫికెట్లను అందజేశారు. తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్రెడ్డి, ఈఓపీఆర్డీ చంద్ర, సచివాలయ కన్వీనర్ సాయి, సర్పంచ్ సునీల పాల్గొన్నారు.

పూతలపట్టు: పూతలపట్టు–1, గాండ్లపల్లి సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పెనుగొండ నియోజకవర్గ అబ్జర్వర్ బాబురెడ్డి పాల్గొన్నారు. గాండ్లపల్లి పంచాయతీలో 757 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. పార్టీ కన్వీనర్ శ్రీకాంత్రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జాన్ విక్టర్, సచివాలయ కన్వీనర్ సుధాకర్రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, రాణెమ్మ, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, దొరస్వామిరెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: నాగంవాండ్లపల్లె సచివాలయంలో ఎంపీపీ మోహన్, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నాగరాజు చేతుల మీదుగా 130 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వైస్ సర్పంచ్ మునిరత్నం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



తగ్గువారిపల్లెలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా సీఎం జగన్మోహన్రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని తగ్గువారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో తగ్గువారిపల్లె, ఆర్ఆర్ నగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని అర్హులకు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఇంటికే వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించేందుకు వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటు పడుతున్న వైఎస్ జగన్మోహన్రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి పట్టం కట్టాలని కోరారు. మురుగు కాలువలు, ఇళ్ల స్థలాలు, ఆర్ఆర్నగర్లో తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చర్చి వెనుకగల గృహాలకు దారి సమస్య పరిష్కరించాలన్నారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ వాణిప్రియ, ఎంపీటీసీ సభ్యులు షబీనా, హేమచంద్ర, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్లప్ప, జిల్లా యువత ఉపాధ్యక్షుడు మహేంద్ర, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్నకుమార్, బీసీ నాయకుడు సురేంద్ర, పార్టీ నాయకులు రఘుపతి, కృష్ణమూర్తి, ఎంపీడీఓ మధుసూదన్రెడ్డి, తహసీల్దార్ బెన్నురాజ్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ కాలనీలో..

తగ్గువారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ చెప్పారు.

ముగిసిన అంగన్వాడీ వర్కర్ల దీక్ష

చిత్తూరు కార్పొరేషన్ : తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ వర్కర్ల 36 గంటల దీక్ష మంగళవారం ముగిసింది. వారు వేలూరు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన రోజే బెనిఫిట్స్ ఇవ్వాలని, హెల్పర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రమీల, సరళ, కసూర్తి, శ్యామల, అనిత తదితరులు పాల్గొన్నారు.



మామిడిలో అంతర పంటలు సాగు చేయండి



యాదమరి: మ్యాంగో ప్లాంట్ను పరిశీలిస్తున్న పీడీ గంగా భవాని



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న

యాదమరి: మామిడి తోటల్లో రైతులు అంతర్ పంటలు పండించుకోవాలని ఉపాధిహామీ పథక పీడీ గంగాభవాని సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని పలు మ్యాంగో ప్లాంట్లను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నట్లు చెప్పారు రైతులకు ఉచితంగా రాగులు అందిస్తామని, మ్యాంగో ప్లాంట్స్లో రాగి పంటలను అంతర పంటలుగా సాగు చేయాలని, అలాగే కందులు కూడా ఇస్తామని వాటిని చల్లుకోవాలని కోరారు. యాదమరి మండల ఉపాధిహామీ ఏపీఓ బాల, తదితరులు ఉన్నారు.

అంతర పంటలపై దృష్టి పెట్టండి

యాదమరి:మండలంలోని రైతులు అందరు అంతర్ పంటలపై దృష్టి పెట్టాలని వ్యవసాయశాఖ ఏఓ చరిత రెడ్డి కోరారు. ఆమె, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది అందరు గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అంతర్ పంటలు పండించుకోవడానికి అవకాశం కల్పిస్తోందన్నారు. ప్రతి రైతుకు 1 కిలో రాగులను ఉచితంగా అందిస్తామని, వాటిని తమ పొలాలలో చల్లుకోవాలని కోరారు.

రాగి పంట సాగుపై అవగాహన

ఐరాల: రైతన్నలు రాగి పంట సాగుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న కోరారు. మంగళవారం మండలంలోని కామినాయనపల్లె రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా నిర్ణయించిందన్నారు. రైతులు రాగి పంట సాగుపై దృష్టి పెట్టాలన్నారు. రాగి సాగుకు ఖర్చు తక్కువ, దిగుబడి, ఆదాయం ఎక్కువన్నారు. మండలంలో 1000 ఎకరాల్లో రాగి పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సాగు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, వీహెచ్ఏ రామచైతన్య పాల్గొన్నారు.

మండల సమాఖ్య అభివృద్ధికి కృషి

గుడిపాల: మండల సమాఖ్య అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ప్రసాద్రెడ్డి, జెడ్పీ వైస్ చైర్పర్సన్ రమ్య కోరారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ఏపీఎం సాయిసుధ అధ్యక్షతన వార్షిక సమావేశం నిర్వహించారు. వారితో పాటు సాయి సుధ మాట్లాడారు. ఈ సంవత్సరం ఆదాయ వివరాలను వెల్లడించారు. చిన్నతరహా పరిశ్రమలను స్థాపనకు ద్వారా మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీనికి ముందుకు రావాలని కోరారు. ఎంపీడీఓ రాజశేఖర్రెడ్డి, వెలుగు సీసీలు హేమచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, మల్లీశ్వరి, నాయకులు శిలంబరసన్, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

మండల సమాఖ్య నూతన కమిటీ ఎంపిక

మండల సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కార్తి, ఉపాధ్యక్షురాలిగా విశాలాక్షి, కార్యదర్శిగా మేరి, ఉప కార్యదర్శిగా లత, కోశాధికారిగా వనితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్పర్సన్ రమ్య